# ప్రజా మారిటైమ్

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





ఇకపై నో 10 మినిట్స్ డెలివరీ

డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 190 పేజిలు : 04 వెల రూ. 2 బుధవారం 14 - 01 - 2026


### కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే

# ప్రచారంలో వాస్తవం లేదు

- కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారంపై స్పందించిన మహేశ్ గౌడ్
- కవిత పార్టీలో చేరుతారనే ప్రచారంలో వాస్తవం లేదన్న టీపీసీసీ చీఫ్
- కవిత ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్న మహేశ్ కుమార్ గౌడ్
- కాంగ్రెస్ నాయకులే అసలైన హిందువులు అన్న మహేశ్ కుమార్ గౌడ్
- గతంలో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని విమర్శించారు
- బీజేపీ గతమేనని, దానికి భవిష్యత్తు లేదని జోస్యం మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు



హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ, ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ దోపిడీకి కవిత వ్యాఖ్యలే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. కవిత వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని స్వయంగా కవితనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.గతంలో జిల్లాల విభజన - మిగతా 2 లో


### తెలంగాణలో తగ్గిన నేరాలు

# పెరిగిన ఖైదీలు

- 2025లో తెలంగాణాలో నేరాలు తగ్గాయి కానీ... పెరిగిన ఖైదీల సంఖ్య!
- 2025లో తెలంగాణ జైళ్లలో 12% పెరిగిన ఖైదీల సంఖ్య
- సైబర్ క్రైమ్, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో భారీ పెరుగుదలే ప్రధాన కారణం
- జైలుకు వెళ్లినవారిలో సగానికి పైగా 18-30 ఏళ్ల మధ్య వయసు వారే
- మొత్తం ఖైదీలలో 40 వేల మంది మొదటిసారి నేరం చేసినవారే కావడం ఆందోళనకరం
- రాష్ట్రంలో మొత్తం నేరాలుతగ్గినప్పటికీ కొన్ని రకాల కేసుల్లో పెరుగుదల




హైదరాబాద్ : తెలంగాణలో 2025వ సంవత్సరంలో జైలుకు వెళ్లిన వారి సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఖైదీల సంఖ్య దాదాపు 12% పెరిగిందని, మొత్తం 42,566 మంది జైలుకు వెళ్లారని రాష్ట్ర జైళ్ల శాఖ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా సైబర్ నేరాలు, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో భారీ పెరుగుదల నమోదవడం ఈ పెరుగుదలకు ప్రధాన - మిగతా 2 లో




### 'బ్రిక్స్' సారథిగా ప్రపంచ

# సంక్షేమమే మా లక్ష్యం

- విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్
- బ్రిక్స్ - 2026' లోగో, అధికారిక వెబ్‌సైట్లను ప్రారంభించిన విదేశాంగ మంత్రి జై శంకర్
- 'అందరికీ వికాసం' అనే లక్ష్యంతో ఈసారి బ్రిక్స్ సదస్సు
- ఈ ఏడాది జనవరి 1 నుంచి బ్రిక్స్ కూటమి సారథిగా భారత్ వ్యవహరిస్తోంది
- బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమని విశ్లేషించింది



ఢిల్లీ : ఈ ఏడాది బ్రిక్స్ కూటమి సారథిగా ప్రపంచ సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. కూటమిలోని అన్ని దేశాలను కలుపుకొని ప్రపంచ సంక్షేమానికి ప్రభావవంతంగా కృషి చేస్తామన్నారు. 2026 సంవత్సరం నాటికి బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు గడిచాయని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవధిలో ప్రపంచ ప్రధాన మార్కెట్లు, వికసిత ఆర్థిక వ్యవస్థల మధ్య సహకార భావనను - మిగతా 2 లో




## ఇరాన్‌లో భగ్గుమన్న ప్రజాగ్రహం

నిరసనల్లో 2 వేల మంది మృతి

ఇరాన్‌లో నిరసనల్లో వేల మంది మృతి

రాయిటర్స్‌కు వెల్లడించిన ఇరాన్ ప్రభుత్వ అధికారి

ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు

అల్లర్ల వెనుక విదేశీ శక్తుల హస్తం ఉందని ప్రభుత్వ ఆరోపణ

దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేత

### ఆపరేషన్ సిందూర్‌ను

# కచ్చితత్వంతో అమలు చేశాం

- ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది
- త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనం
- పరేషన్ సిందూర్ త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని వెల్లడి
- 88 గంటల పాటు సాగిన ఆపరేషన్ సిందూర్‌ను కచ్చితత్వంతో అమలు చేశాం
- భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో సైనిక సంసిద్ధత సిందూర్ ద్వారా స్పష్టమైందని వెల్లడి
- ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశామన్న ఆర్మీ చీఫ్
- దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది
- ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన ఆర్మీ చీఫ్



ఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. స్పష్టమైన రాజకీయ ఆదేశాలు, పూర్తి స్వేచ్ఛతోనే ఈ ఆపరేషన్ అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతూనే ఉందని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో చర్యలు తీసుకోవడానికి లేదా ప్రతిస్పందించడానికి సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ప్రతిస్పందిస్తాయి. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. ఈ - మిగతా 2 లో

## ఏపీలో 11 జిల్లాలకు కొత్త జేసీలు

- కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు జేసీగా పి.శ్రీనివాసులు నియామకం
- రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బచ్చు స్మరణ్, రాజ్‌కు పోలవరం జిల్లా జాయింట్
- కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్




# నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు

- పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- మూడు రోజులపాటు నారావారిపల్లెలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు
- ముగ్గుల పోటీలను పరిశీలించిన భువనేశ్వరి, బ్రాహ్మణి
- నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకలు
- సీఎం చంద్రబాబు, కుటుంబ సభ్యులతో కలిసి సంబరాల్లో లోకేశ్ సందడి
- గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన చంద్రబాబు, భువనేశ్వరి
- తిరుపతి, చంద్రగిరి సమీపంలో రూ.126 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఈ జాబితాలో రహదారులు, ఇండోర్ స్టేడియం, నైపుణ్య శిక్షణ కేంద్రం,ఎస్సీయూలో వసతి గృహ సముదాయాలు, ఆస్పత్రుల్లో అదనపు వార్డులు, ఆలయాల మరమ్మతులు



అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సంబరాల్లో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రాహ్మణి, దేవాంశ్, బాలకృష్ణ సతీమణి వసుంధర, తేజస్విని, శ్రీభరత్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను భువనేశ్వరి, బ్రాహ్మణి పరిశీలించారు. ముగ్గులు బాగా వేశారంటూ మహిళలను ప్రశంసించారు. గ్రామంలో నిర్వహించిన సంప్రదాయ క్రీడా పోటీలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. సంక్రాంతి వేళ మూడు రోజుల పాటు నారావారిపల్లెలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండనున్నారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ క్రీడా పోటీల్లో దేవాంశ్ పాల్గొన్నాడు. ఆయా పోటీలను సీఎం, కుటుంబసభ్యులు తిలకించారు. అనంతరం విజేతలకు చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రజల నుంచి వినతిపత్రాలను సీఎం స్వీకరించారు.చిన్నారులతో కలిసి పోటీల్లో పాల్గొన్న సీఎం మనవడు దేవాంశ్ : చిన్నారులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. పిల్లలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. పిల్లలు ఈ పోటీల్లో పాల్గొని సందడి చేశారు. దేవాంశ్ కూడా ఈపోటీల్లో పాల్గొనగా సీఎం చంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యులు చిన్నారులను ఉత్సాహపరిచారు.పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు : మూడు రోజుల పాటు నారావారిపల్లె పర్యటనలో భాగంగా స్వర్ణనారావారిపల్లె - మిగతా 2 లో

### సార్లంకపల్లె అగ్నిప్రమాద బాధితులకు

# సీఎం చంద్రబాబు భరోసా

- తక్షణ సాయం, పక్కా ఇళ్లు
- కాకినాడ జిల్లాలో అగ్నిప్రమాదం, 26 గుడిసెలు దగ్ధం
- నిరాశ్రయులైన 33 గిరిజన కుటుంబాలు
- బాధితులకు రూ. 25 వేల తక్షణ సాయం ప్రకటించిన సీఎం
- ప్రతి కుటుంబానికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం
- గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు



అమరావతి : కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె గ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 26 గిరిజన గుడిసెలు పూర్తిగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## అష్టదిగ్బంధంలో ఇరాన్!

సమస్యలున్నచోట నిప్పురా జేయటం సులభం. నిన్న మొన్నటివరకూ అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులతో ఊపిరాడని ఇరాన్ ఇప్పుడు నిరసనలతో అట్టుడుకు తోంది. భవనాలు, బస్సులు, దుకాణాలు తగలబడుతున్నాయి. రాజధాని టెహ్రాన్ నగరం యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తోంది. అదొక్కటే కాదు.. .దేశంలోని 31 ప్రావిన్సుల్లో ఉన్న 180 నగరాలు, పట్టణాలు ఇప్పుడు ఆగ్రహావేశాలతో రగులుతున్నాయి. ద్రవ్యోల్బణం చుక్కలనంటుతూ, కరెన్సీ విలువ పడిపోతూ దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్న జనం గత రెండువారాలుగా రోడ్లపై వెల్లువెత్తుతుండగా, ఇంతవరకూ సైన్యం, పోలీసులు జరిపిన కాల్పుల్లో 538 మంది మరణించారు.పదివేలమందిని జైళ్లలోపెట్టారు. మొత్తానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులాలో సాధించలేనిది ఇరాన్‌లో సునాయాసంగా చేయగలిగారు. వెనిజులాలో ఇదే మాదిరి ప్రేరేపించి, ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందన్న సాకుతో అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దించాలని ట్రంప్ ఏడాదిగా ప్రయత్నించారు. అది అసాధ్యం కావటంతో నేరుగా సైన్యాన్ని పంపి మదురో దంపతుల్ని అపహరించారు. ప్రస్తుతం ఇరాన్‌పై దాడులు చేయటానికి అమెరికా సంసిద్ధమవుతోంది.దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అమెరికా, పాశ్చాత్యదేశాలు పగబట్టి అమలు చేస్తున్న ఆర్థిక ఆంక్షలతో ఇరాన్ తీవ్రంగా దెబ్బతింది. నిత్యావసరాలు దొరక్క ప్రజలు సతమతమవుతున్నారు. ప్రాణావసర ఔషధాల కొరత వేధిస్తోంది. తగిన వైద్య సదుపా యాలు కరవై రోగాల బారిన పడిన చిన్నపిల్లలు కన్నుమూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు పెల్లుబకటం, నిరసనలు వెల్లువెత్తడంలో ఆశ్చర్య మేమీ లేదు. ఇటీవల ఆందోళనకారుల నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌లో విదేశీ మహిళగా భావిస్తున్న ఒకామె అరెస్టయినప్పుడు ఏం చేయాలో, ఎలాంటి ప్రకటన లివ్వాలో చెప్పే వీడియో బయటికొచ్చింది. తమ వెనుక ఎవరూ లేరని... దుర్భర పరిస్థి తుల్ని తట్టుకోలేక నిరసనల్లో పాలుపంచుకుంటున్నట్టు చెప్పాలన్న హితబోధ ఉంది.ఇరాన్‌కు ఇలాంటి నిరసనలు కొత్తగాదు. 1979లో ఇరాన్ షా మహమ్మద్ రెజా పెహ్లావీని గద్దెదించిన ఇస్లామిక్ విప్లవం అనంతరం పాశ్చాత్య దేశాలు సమయం కోసం కాచుక్కూర్చున్నాయి. 2022లో మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, ఉనికి కోసం అంటూ సాగిన ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచేయగలిగింది. ఇక అడపా దడపా ఏదో ఒక వంకతో ఇరాన్‌పై క్షిపణుల్ని ప్రయోగించటం, దేశ సైన్యంలో కీలకపాత్ర పోషిస్తున్న వారిని, అణు శాస్త్రవేత్తలనూ హత్యలు చేయించటం ఇజ్రాయెల్‌కు రివాజు. ఇలా జరిగిన ప్రతిసారీ ద్రోహుల్ని పట్టుకున్నామని ప్రభుత్వం ప్రకటించి, బహిరంగంగా ఉరిశిక్షలు అమలు చేస్తోంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి ఆందోళనల తీవ్రత ఎక్కువుంది. దిగువ తరగతి ప్రజలతో పాటు మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు కూడా ఈ నిరసనల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి.నిరసనలు చల్లార్చటానికి ప్రభుత్వం ప్రయత్నించకపోలేదు. దుకాణదారుల డిమాండ్లకు స్పందనగా సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చారు. ప్రతి ఇంటికీ నెలకు ఏడు డాలర్ల మొత్తం ఇచ్చేందుకు అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అంగీకరించారు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ఉద్యమకారులు వెనక్కి తగ్గేది లేదన్నారు. సాధారణ ప్రజానీకం సమస్యల్ని పరిష్కరిస్తానని, ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తానని అధికారంలోకొచ్చిన మసూద్ పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వంలో పెచ్చరిల్లిన అవినీతిని అరికట్టలేక పోయారు. ప్రజల్లో అసంతృప్తి కనబడుతున్నా నాయకత్వం నిస్తేజంగా ఉండిపోయింది.పైపెచ్చు నిరసనల్లో పాల్గొంటున్న వారిని 'దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం సాగిస్తున్నార'ంటూ కేసులు పెట్టడం, అరెస్టులు చేయటం ప్రజల్ని మరింత రెచ్చగొట్టింది. ఈ నేరారోపణ కింద ఉరిశిక్షతో సహా కఠినమైన శిక్షలు విధించటానికి ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. అమెరికాలో స్థిరపడిన ఒకప్పటి నియంత ఇరాన్ షా కుమారుడు రెజా పెహ్లావి తానొచ్చి దేశాన్ని ఉద్ధరిస్తానంటున్నారు. ఛాందసవాద ధోర ణుల్ని తగ్గించుకుని ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పితే తప్ప బలప్రయోగంతో నిరసనలు అణిచేయటం అసాధ్యమని ఇరాన్ పాలకులు గుర్తించాలి.

## ఆపరేషన్ సిందూర్‌ను కచ్చితత్వంతో అమలు చేశాం

**మొదటిపేజీ తరువాయి** – ఆపరేషన్‌లో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు,ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, పౌర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే హోం మంత్రిత్వ శాఖ, రైల్వేలు తదితర శాఖలు కీలక పాత్ర పోషించాయి' అని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రశంసించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం, అత్యున్నత స్థాయిలో తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆర్మీ చీఫ్ తెలిపారు. మే 7న కేవలం 22 నిమిషాల్లో ప్రారంభమైన ఆపరేషన్, మే 10 వరకు 88 గంటల పాటు సాగిందని వివరించారు. 'ఈ ఆపరేషన్ ద్వారా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం, లోతైన లక్ష్యాలపై దాడులు, శత్రు దేశాల అణు బెదిరింపుల ప్రచారాన్ని ఖండించడం వంటి కీలక విజయాలు సాధించాం. మొత్తం 9 లక్ష్యాల్లో ఏడింటిని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. అనంతరం పాకిస్థాన్ నుంచి వచ్చిన చర్యలకు సమతుల్యమైన ప్రతిస్పందన ఇవ్వడంలో సైన్యం కీలక పాత్ర పోషించింది ' అని జనరల్ ద్వివేది తెలిపారు. 2025లో 31 మంది ఉగ్రవాదులను నిర్మూలించినట్లు ఉపేంద్ర ద్వివేది తెలిపారు. వారిలో 65శాతం మంది పాకిస్థాన్‌కు చెందినవారని అన్నారు. వీరిలో పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులు ఆపరేషన్ మహాదేవ్‌లో చంపేసినట్లు చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సాయుధ ఘర్షణల్లో గణనీయమైన పెరుగుదల కనిపించిందని ద్వివేది పేర్కొన్నారు. సిద్ధంగా ఉన్న దేశాలే విజయం సాధిస్తాయి అనే వాస్తవాన్ని ఈ పరిస్థితులు గుర్తు చేస్తున్నాయని అన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధతను ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని తెలిపారు. అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని అన్నారు. చైనా సరిహద్దులోని భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. అలాగే జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగా ఉన్నా, ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక 'జాయింట్‌నెస్, ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్' ఆధారంగా చేపట్టిన సంస్కరణ వల్ల 2025లో భారత్



సైన్యం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు.

## 'బ్రిక్స్' సారథిగా ప్రపంచ సంక్షేమమే మా లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి** – పెంపొందించే వేదికగా బ్రిక్స్ నిలిచిందన్నారు. మంగళవారం 'బ్రిక్స్ – 2026' లోగో, అధికారిక వెబ్‌సైట్లను జై శంకర్ ప్రారంభిం చారు. 'అందరికీ వికాసం' అనే లక్ష్యంతో ఈసారి బ్రిక్స్ సదస్సు జరుగుతుందన్నారు. గత రెండు దశాబ్దాల వ్యవధిలో బ్రిక్స్ కూటమి అజెండా, సభ్యత్వాలు గణనీయంగా పెరిగాయని ఆయన గుర్తు చేశారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తూ, ప్రజా కేంద్రక వికాసంపై ఫోకస్ చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బ్రిక్స్ కూటమిలోని దేశాలు ఆచరణాత్మక సహకార భావనతో సంప్రదింపులు జరుపుతూ పురోగమిస్తున్నాయన్నారు.

**లక్ష్యాన్ని ప్రతిబింబించేలా లోగో, వెబ్‌సైట్**

"బలమైన, వైవిధ్య, సహకారాత్మక, సుస్థిరమైన బ్రిక్స్ కూటమిని సాకారం చేసేందుకు మేం ప్రయత్నిస్తాం. సమతూకంగా, ఐక్యతా భావనతో ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేలా కూటమి దేశాలను సమాయత్తం చేస్తాం. ఇప్పుడు మేం విడుదల చేసిన బ్రిక్స్ లోగో ఈ లక్ష్యాలను అద్దం పట్టేలా ఉంది. సంప్రదాయకత, ఆధునికతలను మేళవిస్తూ బ్రిక్స్ లోగోను రూపొందించాం. అందులోని కమలం రేకులు బ్రిక్స్ కూటమిలోని అన్ని దేశాలను ప్రతిబింబిస్తాయి. ఐకమత్యం, వైవిధ్యం, ఉమ్మడి లక్ష్యం అనే భావనలను ఈ లోగో అద్దంపడుతోంది. లోగో మధ్యనున్న 'నమస్తే' చిహ్నం అనేది గౌరవభావన, సహకార భావనకు ప్రతీక. బ్రిక్స్ ఇండియా వెబ్‌సైట్‌లో ఈ ఏడాది జరగబోయే సదస్సు, సమావేశాలు,



కార్యక్రమాల వివరాలన్నీ ఉంటాయి. ఈ ఈవెంట్స్ ద్వారా సాధించే లక్ష్యాలపైనా అప్‌డేట్స్ ఇస్తాం. పూర్తి పారదర్శకంగా ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందుబాటులో ఉంచుతాం. దీని ద్వారా సకాలంలో సకల సమాచారాన్ని చేరవేస్తాం" అని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు.

**అంతర్జాతీయ అనిశ్చితిలో ప్రపంచ దేశాలు**

"ప్రస్తుతం అంతర్జాతీయ వాతావరణంలో అనిశ్చితి ఉంది. ఎన్నో చిక్కుముడులు, సవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాలా దేశాల నడుమ అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక సంక్షోభాలూ కనిపిస్తున్నాయి. ఇక ఇదే సమయంలో విప్లవాత్మక సాంకేతిక మార్పు లు జరుగుతున్నాయి. ఈ అన్ని పరిణామాల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలో కీలకమైన కూటమిగా బ్రిక్స్ ప్రాధాన్యం, బాధ్యత పెరుగుతున్నాయి. మేం సంప్ర దింపులను, సహకారాన్ని, ఆచరణాత్మక స్పందనను ప్రోత్సహిస్తాం. ఇక ఇదే సమయంలో దేశాల వికాసం, జాతీయ ప్రయోజనాలపైనా ఫోకస్ పెడతాం" అని ఎస్ జైశంకర్ తెలిపారు.

**ప్రపంచ ప్రభావశీల శక్తిగా బ్రిక్స్**

ఈ ఏడాది జనవరి 1 నుంచి బ్రిక్స్ కూటమి సారథిగా భారత్ వ్యవహరిస్తోంది. 2026 ఆగస్టు లేదా సెప్టెంబరులో భారత్ వేదికగా ఈ కూటమి సదస్సు జరిగే అవకాశాలు ఉన్నాయి. 2006లో భారత్, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా కలిసి బ్రిక్స్‌ను ఏర్పాటు చేశాయి. తర్వాత సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, ఇండోనేషియా ఇందులో శాశ్వత సభ్యులుగా చేరాయి. ప్రపంచ జనాభాలో 49.5 శాతం ఈ 11 దేశాల్లోనే ఉంది. ప్రపంచ వార్షిక జీడీపీలో 40 శాతం ఈ దేశాల నుంచే వస్తుంటుంది. ప్రపంచంలో ఏటా జరిగే వాణిజ్యంలో 26 శాతం ఈ దేశాల ద్వారానే జరుగుతుంటుంది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ 'గోల్డ్‌మన్ సచ్స్' 2001లో ఒక అంతర్జాతీయ ఆర్థిక నివేదికను విడుదల చేసింది. అందులో తొలిసారిగా 'బ్రిక్స్' అనే పదాన్ని ప్రస్తావించింది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమని విశ్లేషించింది.

## ఇరాన్‌లో భగ్గుమన్న ప్రజాగ్రహం

**మొదటిపేజీ తరువాయి** – ఇరాన్‌లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ నిరసనల్లో భద్రతా సిబ్బందితో సహా దాదాపు 2,000 మంది మరణించినట్లు ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఇంత పెద్ద సంఖ్యలో మరణాలను అంగీకరించడం ఇదే మొదటిసారి. దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, స్థానిక కరెన్సీ (రియాల్) విలువ పడిపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. డిసెంబర్ 28, 2025న టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో మొదలైన ఈ నిరసనలు, అనతికాలంలోనే దేశంలోని 31 రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ మరణాలకు ఉగ్రవాదులే కారణమని, వారే ప్రజలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని సదరు అధికారి ఆరోపించారు. అయితే, మృతుల్లో పౌరులు ఎంతమంది, భద్రతా సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు.1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలోకి వచ్చిన మతపరమైన నాయకత్వానికి, గత మూడేళ్లలో ఇదే అతిపెద్ద అంతర్గత సవాలుగా మారింది. ఆర్థిక సమస్యలపై నిరసనలు చట్టబద్ధమే అని చెబుతూనే, ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. ఈ అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో సమాచార వ్యాప్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా బలగాలు, నిరసన



కారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రభు త్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారంలో వాస్తవం లేదు



**మొదటిపేజీ తరువాయి** – అశాస్త్రీయంగా జరిగిందని విమర్శించారు. ఒక నియోజక వర్గం మూడు నాలుగు జిల్లాల్లో ఉందని, కేసీఆర్ తన కొడుకు కోసం, అల్లుడి కోసం, కూతురు కోసం ఒక్కో జిల్లా చేశారని ఆరోపించారు.బీజేపీ గతమేనని, దానికి భవిష్యత్తు లేదని జోస్యం మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. బీఆర్ఎస్‌కు చరిత్రే మిగులుతు ందని అన్నారు. దేవుడి పేరు ప్రస్తావించకుండా బీజేపీ రాజకీ యం చేయదని విమర్శించారు. అసలైన హిందువులు కాంగ్రెస్ నాయకులేనని అన్నారు. తాము ఇంట్లో పూజిస్తామని, బయటకు వచ్చాక అన్ని మతాలను గౌరవిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నేతల దోపిడీపై ప్రశ్నిస్తే రాజకీయ ఆరోపణలు అంటారని, మరి కవిత ఆరోపణల సంగతి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు. మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని అన్నారు. మేడారంలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని అభిప్రాయపడ్డారు.సినిమాల టిక్కెట్ ధరలను ఎంత పెంచకూడదని ప్రయత్నించినప్పటికీ, పరిశ్రమను ప్రోత్సహించేందుకు తప్పడం లేదని అన్నారు. పార్టీలో ఒకరికి రెండు నామినేటెడ్ పదవులు ఇవ్వవద్దని నిర్ణయించినట్లు చెప్పారు. ఐఏఎస్ అధికారులపై వచ్చిన ఆరోపణలు సరికాదని అన్నారు. ఇష్టారీతిన వార్తలు రాస్తే ఎలాగని ప్రశ్నించారు. మీడియాలో జరిగిన అసత్య కథనాలపై సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణాలో తగ్గిన నేరాలు పెరిగిన ఖైదీలు



**మొదటిపేజీ తరువాయి** – కారణంగా నిలిచింది. జైలుకు వెళ్లిన వారిలో అత్యధికులు 18–30 ఏళ్ల మధ్య వయసు వారే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.జనవరి 12న జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ఈ నివేదికను విడుదల చేశారు. నివేదిక ప్రకారం, 2024లో 38,079 మంది జైలుకు వెళ్లగా, 2025లో ఆ సంఖ్య 42,566కు చేరింది. సైబర్ క్రైమ్ కేసుల్లో జైలుకు వెళ్లిన వారి సంఖ్య ఏకంగా 135% పెరిగి 1,784కి చేరింది. ఇక డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 152% పెరుగుదలతో 2,833 మంది కటకటాల పాలయ్యారు. వీటితో పాటు డ్రగ్స్ (ఎన్‌డీపీఎస్) కేసుల్లో 7,040 మంది, పోక్సో కేసుల్లో 4,176 మంది, హత్య కేసుల్లో 3,260 మంది జైలుకు వెళ్లినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ నివేదికలోని అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. జైలుకు వెళ్లిన వారిలో 19,413 మంది 18–30 ఏళ్ల వయసు వారే ఉండటం. వీరిలో ఎక్కువ మంది జనరేషన్ (+వఅ )కి చెందినవారు. అంతేకాకుండా, మొత్తం ఖైదీలలో 40,090 మంది మొదటిసారి నేరం చేసి జైలుకు వెళ్లిన వారే కావడం గమనార్హం. ఇది యువత నేరాల బారిన పడకుండా నివారించడంలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది.ఆసక్తికరంగా, 2025లో తెలంగాణలో మొత్తం నేరాల సంఖ్య 2.33% మేర తగ్గినట్లు పోలీసు శాఖ ఇటీవలే ప్రకటించింది. అయినప్పటికీ, సైబర్ నేరాలు, డ్రంకెన్ డ్రైవ్ వంటి నిర్దిష్ట నేరాలు పెరగడం వల్ల జైళ్లపై భారం పడుతోంది. అయితే, కోర్టు విచారణల కోసం ఖైదీలను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హాజరుపరచడం 70 శాతానికి పెరిగిందని, ఇది పాలనలో ఆధునికతను సూచిస్తోందని అధికారులు తెలిపారు. యువతను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ భద్రత, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు నొక్కి చెబుతున్నాయి.

## నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు

**మొదటిపేజీ తరువాయి** – కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టనున్నారు. తిరుపతి, చంద్రగిరి సమీపంలో రూ.126 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. రహదారులు, ఇండోర్ స్టేడియం, నైపుణ్య శిక్షణ కేంద్రం, పీహెచ్‌సీ, ఎస్వీయూలో వసతి గృహ సముదాయాలు, ఆస్పత్రుల్లో అదనపు వార్డులు, సౌకర్యాల గదులు, ఆలయాల మరమ్మతులు వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. కల్యాణి డ్యాంతో పాటు మరో 4 చెరువులకు నీవా బ్రాంచి నుంచి నీటిని తరలించే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం స్వగ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్థులు తెలిపారు.సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లె చంద్రగిరి మండలంలోని ఉన్న కందులవారిపల్లె పంచాయతీతో పాటు ఎ.రంగంపేట, చిన్న రామాపురం పంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం చర్యలు చేపట్టారు. గత సంవత్సరం జులై నాటికి అన్ని గృహాలకు సౌర విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ 3 పంచాయతీల్లోని మొత్తం 2,161 గృహాల్లోనూ కుళాయి, గ్యాస్ కనెక్షన్లు కూడా ఉన్నాయి. గత సంవత్సరం సంక్రాంతి పండగ సందర్భంగా సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చినప్పుడు 'స్వర్ణ నారావారిపల్లె' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ప్రణాళిక సైతం రూపొందించింది. దానిని దశల వారీగా అమలు చేస్తోంది.

## సార్లంకపల్లె అగ్నిప్రమాద బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా


**మొదటిపేజీ తరువాయి** – కాలి బూడిదయ్యాయి. ప్రమాదం కారణంగా 33 కుటుంబాలు నిలువ నీడ కోల్పోయి నిరాశ్రయులయ్యాయి. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. అధికారులతో మాట్లాడి బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశించారు. తక్షణ సహాయంగా ప్రతి బాధిత కుటుంబానికి రూ.25,000 నగదు అందించాలని, ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు తాత్కాలిక వసతి, ఆహారం అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ తంగళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. బాధితులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ సాయంపై భరోసా ఇచ్చారు.తహసీల్దార్ ఎస్వీ నరేశ్ మాట్లాడుతూ, 33 కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాధితులందరికీ పక్కా ఇళు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వారికి ఆహారం, ఇతర నిత్యావసరాలు అందించే పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

## ఏపీలో 11 జిల్లాలకు కొత్త జేసీలు

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాలకు ప్రభుత్వం కొత్త జాయింట్ కలెక్టర్లను నియమించింది. ఈ జాబితాలో తాజాగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలు కూడా ఉన్నాయి. గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పి. శ్రీనివాసులును మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు.చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గొబ్బిళ్ల విద్యాధరిని విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా నియమించగా, అన్నమయ్య జిల్లా జేసీగా ఉన్న ఆదర్శ రాజేంద్రన్‌ను చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. సివిల్ సప్లయిస్ డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్న ఆర్. గోవిందరావును బదిలీ చేసి తిరుపతిలోని టుడా వైస్ చైర్మన్‌గా నియమించడంతో పాటు తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.ప్రకాశం జిల్లా జేసీగా ఉన్న గోపాల్ కృష్ణ రోణంకిని ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఖాళీగా ఉన్న పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వి. సంజన సింహాను ప్రభుత్వం నియమించింది.రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న బచ్చు స్మరణ్ రాజ్‌కు కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకుతుంది

**మొదటిపేజీ తరువాయి** – 'వీబీ జీరామ్ జీ' పథకం ద్వారా ఉపాధి కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు లభిస్తాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఉపాధి హామీ పథకం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ'ని ప్రవేశపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన మరోసారి స్పందించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ



కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కంటే ఈ పథకానికి అదనంగా రూ.17 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు న్యాయం చేకూరే విధంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవని, దీనివల్ల కూలీలు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.

## విజయ్ సినిమా విడుదలను కేంద్రం అడ్డుకుంటోంది

**ఇది తమిళ సంస్కృతిపై దాడి: రాహుల్ గాంధీ**

**విజయ్ సినిమా చుట్టూ రాజకీయ దుమారం**

**తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ స్పందన**

**సీబీఎఫ్‌సీని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శ**

**అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విజయ్ పార్టీకి దగ్గరయ్యే ప్రయత్నమంటున్న విశ్లేషకులు**





తమిళ స్టార్ నటుడు, రాజకీయ నేత విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా విడుదలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవాలని చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చర్యలను ఆయన ఖండిస్తూ, ఇది తమిళ సంస్కృతిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు."జన నాయగన్ విడుదలను అడ్డుకోవాలనే ప్రయత్నం తమిళ సంస్కృతిపై దాడి చేయడమే. మోదీ గారూ, మీరు తమిళ ప్రజల గొంతును ఎప్పటికీ నొక్కలేరు" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.విజయ్ రాజకీయ ప్రవేశం తర్వాత వస్తున్న ఈ చివరి సినిమా విడుదలను మద్రాస్ హైకోర్టు నిలిపివేసిన సంగతి తెలిసిందే. సినిమాలో రాజకీయంగా సున్నితమైన 50కి పైగా సంభాషణలు, మాజీ సీఎం ఎంజీఆర్ ప్రస్తావన, రక్షణ దళాల చిత్రీకరణపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ వివాదం మొదలైంది. దీంతో చిత్ర నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.మంగళవారం నీలగిరి జిల్లా పర్యటనలో ఉన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార డీఎంకేతో పొత్తుల విషయంలో విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)కు దగ్గరయ్యే వ్యూహంలో భాగంగానే రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.తమిళనాడు పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్‌ను 'తలైవా (నాయకుడు)' అంటూ పోస్టర్లు వేయడం డీఎంకేతో సీట్ల పంపకాల చర్చల్లో తమ బలాన్ని చాటుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది.ఈ వివాదంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పందిస్తూ... సీబీఎఫ్‌సీని బీజేపీ ఒక ఆయుధంగా వాడుతోందని విమర్శించారు. అయితే, బీజేపీ నేత తమిళిసై సౌందరరాజన్ దీన్ని ఖండించారు. సీబీఎఫ్‌సీ ఒక స్వతంత్ర సంస్థ అని, ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ భావప్రకటనా స్వేచ్ఛను అణిచివేసిందని ఆమె గుర్తుచేశారు.

# ఈ నెల 18న కేబినెట్ భేటీ

**సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో**

**ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న ముఖ్యమంత్రి**

**సీపీఐ 100 సంవత్సరాల వేడుకలకు సీఎం హాజరు**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న ములుగు జిల్లా మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర ఈ నెల 28న ప్రారంభం కానుండటంతో సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో కేబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు తెలిసింది. 18న ఉదయం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేస్తారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సీపీఐ వంద సంవత్సరాల వేడుకలకు సీఎం హాజరవుతారు. అదే రోజున సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటారు. ఆపై 5 గంటల తర్వాత కేబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. కీలక అంశాలపై చర్చలు : 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం, దర్శనం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. అదే రోజు రాత్రి దావోస్‌కు వెళ్తారు. 18న మేడారంలో నిర్వహించాలని యోచిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రధానంగా త్వరలో పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి పథకాలపై చర్చించే అవకాశం ఉంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో అందుకు అనుగుణంగా శాఖల వారీగా రాష్ట్ర బడ్జెట్ రూపుకల్పనపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. రైతు భరోసా నిధుల విడుదల, హ్యామ్ రోడ్లు, తదితర అంశాలపైనా నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. 30 లక్షల మంది వస్తారని అంచనా : మేడారం మహాజాతర నిర్వహణలో ఆర్టీసీ ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకో రెండు వారాల్లో మహా జాతర ప్రారంభం కానుంది. కాగా ఈ జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఆర్టీసీకి నిధులను కేటాయించింది. కిందటి సంవత్సరం జాతరలో సుమారుగా 20 లక్షల మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణించారు. ఈ సంత్సరం 30 లక్షల మంది వరకూ వస్తారని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. 14 వేల మంది సిబ్బంది : గత సంవత్సరం జారత కోసం 3,500 బస్సులను ఉపయోగించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అదనంగా 500 బస్సులను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు వేల బస్సులు ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగ్, నిజామాబాద్ జిల్లాల్లోని 51 పాయింట్ల నుంచి బస్సులు నడిపించనున్నారు. ఈ నెల 25 నుంచి ఆయా ప్రాంతాల నుంచి సర్వీసులు ప్రారంభం కానున్నాయి. దీనిలో మొత్తం 14 మంది సిబ్బంది సేవలు అందించనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఏసీ బస్సులను ఏర్పాటు చేయనున్నారు. అయితే వాటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కల్పించలేదు. రద్దీకి అనుగుణంగా సర్వీసులను సిద్ధం చేయనున్నారు. భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం : అన్ని శాఖల సమన్వయంతో మేడారం జాతరను విజయవంతం చేస్తామని వరంగల్ ఆర్ఎం డి.విజయభాను పేర్కొన్నారు. ఈ నెల 23న మేడారంలో బస్ పాయింట్ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా లంబసింగి అందాలు

**జలప్రవాహాలు, ఆహ్లాదకర పరిసరాలు స్వచ్ఛమైన గాలులు అన్నీ కలగలిపితే అదే లంబసింగి**

**సినిమా చిత్రీకరణలు, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల కారణంగా లంబసింగికి విస్తృత ప్రచారం**



దట్టమైన అడవులు నేలను కమ్మేసిన చెట్ల నీడన ప్రశాంతంగా సాగే జలప్రవాహాలు, ఆహ్లాదకర పరిసరాలు, ప్రకృతి రమణీయత ఉట్టిపడే దృశ్యాలు, స్వచ్ఛమైన గాలులు అన్నీ కలగలిపితే అదే లంబసింగి. పర్యాటక రంగాన్ని విస్తరిస్తే కనువిందు చేసే ఈ సుందర వనాలు సిరులు కురుపిస్తాయని ముందే ప్రభుత్వాలు ఊహించాయి. అందుకు తగినట్టుగా వసతులు సమకూరుస్తూ వస్తున్నాయి. కానీ మూడేళ్లుగా శరవేగంగా విస్తరిస్తున్న పర్యాటకాన్ని అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ సంస్థలు వెనుకబడినట్లే కనిపిస్తోంది. వారాంతాల్లో వేల సంఖ్యలో రద్దీ: సినిమా చిత్రీకరణలు, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల కారణంగా లంబసింగికి విస్తృత ప్రచారం లభించింది. పర్యాటకులు లంబసింగి, తాజంగి, కృష్ణాపురం తదితర పర్యాటక ప్రదేశాలు సందర్శించి కొత్తపల్లి జలపాతాలకు వెళుతున్నారు. సాధారణ రోజుల్లో వందలాది మంది వస్తుంటే వారాంతాల్లో ఈ సంఖ్య వేలల్లో ఉంటుంది. రద్దీని పర్యాటకాభివృద్ధి సంస్థ కంటే ప్రైవేటు వ్యవస్థలు బాగా సద్వినియోగం చేసుకుంటున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలతో ఎకో టూరిజంలో భాగంగా కృష్ణాపురం జాతీయ రహదారి పక్కన వనవిహారి, నేచర్ క్యాంపులు ఏర్పాటు చేశారు. చెక్కలతో కూడిన కాటేజీ, గుడారాలు తదితర సదుపాయాలు కల్పించారు. ఇవితప్ప ఇతరత్రా పర్యాటక ఆకర్షణల మెరుగుపై దృష్టిపెట్టింది లేదు. ప్రైవేటు వ్యక్తులేమో బినామీ పేర్లతో ఇక్కడ భూములు కొనుగోలు చేసి భారీగా రిసార్టులు, కాటేజీలు, అతిథి గృహాల నిర్మాణాలు చేపట్టారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో రద్దీ తీవ్రత పెరగడంతో ఇదే అదునుగా అద్దెలు విపరీతంగా పెంచుతున్నారు. ఇటీవల లంబసింగి వద్ద ప్రైవేటు యాజమాన్యం ఆధ్వర్యంలో పలు రకాల పూల తోటలు అందుబాటులోకి తీసుకువచ్చారు. బంతి, చామంతి పూలు మాత్రమే అమ్మకాలు నిర్వహిస్తున్నారు. తక్కిన పూలతోట అంతా ఫొటో షూట్‌కు ఏర్పాటు చేశారు. పర్యాటకులు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. అన్ని సదుపాయాలతో అతిథి గృహం: ఎట్టకేలకు చింతపల్లిలోని జిల్లా పరిషత్తు అతిథి గృహానికి మోక్షం కలిగింది. చాలాకాలంగా ఇది నిరుపయోగంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జడ్పీ నిధుల నుంచి రూ.20 లక్షలను మరమ్మతులకు కేటాయించారు. దీంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనులు చేపట్టారు. పాత భవనానికి మరమ్మతుతోపాటు సుందరీకరణ చేస్తున్నారు. చింతపల్లి వచ్చే పర్యాటకులకు అన్ని సదుపాయాలతో అతిథి గృహాన్ని అందుబాటులోకి తేనున్నట్లు పీఆర్ డీఈఈ జ్యోతిబాబు చెప్పారు. చెరువులవెనం వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు: లంబసింగి సమీపంలోని చెరువులవెనం వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాల్లో వచ్చే వారు కొండపైకి వెళ్లేందుకు స్థానికులు అనుమతించడం లేదు. రాళ్లు తేలి రోడ్డంతా ప్రమాదకరంగా మారింది. పర్యాటకుల్లో కొందరు ప్రయాసపడుతూ కాలినడకన కొండెక్కుతున్నారు. చాలామంది స్థానిక గిరిజన యువత ఆధ్వర్యంలో ఏర్పాటైన జీపుల్లో కొండపైకి చేరుకుంటున్నారు. చెరువులవెనం కొండపైకి మొదట్లో పర్యాటకులు లంబసింగి గ్రామంలోని గిరిజన రైతుల కాఫీ తోటల మీదుగా నడిచి వెళ్లే వారు. పర్యాటకుల రాక వల్ల కాఫీ తోటలు దెబ్బతింటున్నాయంటూ రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో చెరువులవెనం వెళ్లేందుకు భీమనాపల్లి నుంచి రహదారిని అధికారులు ఉపాధి హామీ పథకంలో మంజూరు చేశారు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రహదారి పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. గ్రామస్థులు కొంతమేర రహదారిని చదును చేసి వాహనాల రాకపోకలకు వీలుగా మార్గం సుగమం చేశారు. సాగు భూములను పార్కింగ్ స్థలాలుగా మార్చి: వారాంతాలు, పండగ సమయాల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకులు వచ్చే వాహనాలను భీమనాపల్లిలో నిలిపేలా అక్కడి రైతులు తమ పొలాలను పార్కింగ్ స్థలాలుగా మార్చారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు పర్యాటకులను జీపుల్లో కొండపైకి తీసుకువెళ్తున్నారు. రాను, పోను ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు తమ వాహనాల్లో కొండపైకి వెళ్తామన్నా, స్థానికులు అనుమతించడం లేదు. సాగు భూములను పార్కింగ్ స్థలాలుగా మార్చిన కొందరు వాహనాలు నిలిపినందుకు రుసుము వసూలు చేస్తున్నారు. రాళ్లు తేలిన దారిలో సుమారు నాలుగు కి.మీ. దూరం నడిచి కొండ ఎక్కలేక పర్యాటకులు అవస్థలు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, మోకాళ్ల నొప్పులున్న వారు కొంతదూరం వెళ్లి వెనక్కు వచ్చేస్తున్నారు.

# రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారా?

**బండి కోసం పరుగులు పెట్టాల్సి వస్తుంది జాగ్రత్త!**

**ఇష్టారీతిన వాహనాల నిలిపివేత**

**నడిరోడ్డుపై నిలపడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు**

**వాహనాలతో కిక్కిరిసిపోతున్న రహదారులు**

**ఇకపై అక్కడ పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ చలాన్లు కట్టాల్సిందే**

అలా రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఉన్నట్టుండి ఏదైనా వస్తువు గుర్తొచ్చినప్పుడు, లేదా కనిపించినప్పుడు లేదా ఇతర పనుల కోసం వెంటనే ఓ పక్కకు కారు పార్కింగ్ చేసి పనులు పూర్తి చేసుకుంటారు. కానీ తిరిగి వచ్చేలోపు వాహనాలు కనిపించడం లేదని పరుగులు పెట్టేస్తారు. అలా ఇష్టారాజ్యంగా రోడ్డు ఖాళీగా ఉందని ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే ఇలానే ఉంటుంది మరి. ఇలా బైకులు, ఆటోలు, కార్లను నడిరోడ్డుపై ఆపడం ద్వారా ఇతర ప్రయాణికుల రాకపోకలకు అసౌకర్యం కలుగుతుంది. దీంతో నగరంలో ఉన్న రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు, కాలుష్యం, అత్యవసర సేవలకు అంతరాయం కలుగుతుంది. ఇలా పార్కింగ్ కోసం రోడ్ల స్థలాన్ని ఆక్రమించడం వల్ల ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో ప్రజలు రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్‌ను ఆపాల్సి వస్తోంది. మరికొన్నిసార్లు కేవలం ఒక కిలోమీటరు ప్రయాణానికి 30 నిమిషాల వరకు సమయం పడుతోంది. రోడ్లపై ఇలా ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడం కారణంగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను టోయింగ్ చేసి తీసుకెళ్తారు. ఎక్కడపడితే అక్కడే పార్కింగ్‌లు : నగరంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు తక్కువగా ఉంటాయి. ఇలా ఉంటుందని తెలిసినా కూడా వాహనదారులు రోడ్లపై పార్క్ చేయాల్సి వస్తుంది. అన్ని తెలిసినప్పటికీ షాపింగ్, లంచ్ అని ఇతర చిన్న చిన్న పనుల కోసం 10-15 నిమిషాల కోసం వాహనాలను రోడ్డు పక్కన ఆపుతుంటారు. మరీ ముఖ్యంగా నో పార్కింగ్ బోర్డు ఉన్నప్పుడు లేదా అక్కడ పార్కింగ్‌కి స్థలమే లేకపోయినా కూడా అక్కడే పార్కింగ్ చేస్తుంటారు. మరి కొంతమంది పార్కింగ్ నియమాలను కేర్ చేయకుండా తమ సౌలభ్యం కోసం రోడ్లపై అడ్డదిడ్డంగా పార్క్ చేస్తారు. ఇలా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ లేని చోట బైకులను, ఆటోలను, కార్లను పార్కింగ్ చేయడం వల్ల ఇతర పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇకపై ఇలా పార్క్ చేస్తే ట్రాఫిక్ పోలీసులు మీ వాహనాలను తీసుకెళ్తారు.



**చట్టాలు ఇలా ఉన్నాయి :**

నో పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేస్తే సెక్షన్ 120/177 చట్టం కింద వాహనాన్ని తీసుకెళ్తారు.

పాదచారులు నడిచే రోడ్డుపై వాహనాలు ఆపితే సెక్షన్ 39బి ప్రకారం తీసుకెళ్తారు.

రోడ్డుపైన పార్కింగ్ చేస్తే సెక్షన్ 190లోని రెండో క్లాజ్ ప్రకారం వాహనాన్ని తీసుకెళ్తారు.

బస్‌స్టాప్‌ల వద్ద వాహనాలు నిలిపిస్తే 177/179 సెక్షన్ ప్రకారం ఆ వాహనాలను తీసుకెళ్తారు.

షోరూంలు, హోటళ్ల వద్ద రోడ్డుపై నిలిపేసిన వాహనాలను 41సీపీ ప్రకారం తీసుకెళ్తారు.

**చలానాలు ఇలా :**

బైక్/ స్కూటీ - రూ.200

కారు - రూ.500

అంతకంటే పెద్ద వెహికిల్స్ చలానా - రూ.700 నుంచి రూ.1000

గ్రేటర్ పరిధిలో 2025లో వివిధ విభాగాల్లో విధించిన చలానాలు ఇలా - రూ. 55,74,109

వాహనాలు తీసుకెళ్లేందుకు గానూ మన దగ్గర నుంచే డబ్బులు వసూల్ చేస్తారు.

"నగరంలో గతంలో వివిధ వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్ రోడ్లపై నిలిపిన వాహనాలను, చిరువ్యాపారుల బండ్లను తొలగించాం. రోడ్లపై వాహనాలు, చిరువ్యాపారుల వారి బండ్లు పెట్టడం వంటివి చేయకండి."- హరిప్రసాద్, ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్, పంజాగుట్ట, హైదరాబాద్

పాదచారులకు ఇబ్బందులు : రోడ్డుపై వాహనాలు నిలపడం వల్ల పాదచారులకు ఇబ్బందులు కలగడంతో పాటు అనుకొని ప్రమాదాలు సంభవించవచ్చు. అలాగే ఆ ప్రాంతంలో ఎక్కువ ట్రాఫిక్ ఏర్పడే అవకాశం ఉంది. ఫుట్‌పాత్‌లపై, పార్కుల ముందు వాహనాలు పార్క్ చేయడం వల్ల పాదచారులకు నడవడానికి స్థలం ఉండదు.

**ఎక్కడ పార్క్ చేయకూడదంటే? :**

ట్రాఫిక్ సిగ్నల్స్, కూడళ్లు, జిబ్రా క్రాసింగ్‌ల దగ్గర.

ఫుట్‌పాత్‌లు, పార్కుల పక్కన, భవనాల ముందు/ వెనుక.

బస్ స్టాప్‌లు, ఆసుపత్రులు, పాఠశాలల దగ్గర.

రహదారి, వంతెనలపైన/దగ్గర

ట్రాఫిక్ మార్కింగ్‌లు (వైట్ లైన్ ) ఉన్న చోట.

# తగ్గని సంక్రాంతి ఎఫెక్ట్

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్తున్నవారితో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి, కొర్లపహాడ్ టోల్ ప్లాజాల వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద మొత్తం 16 టోల్ బూత్‌లకు గాను, విజయవాడ వైపు ప్రయాణించే వాహనాల కోసం 11 టోల్ బూత్‌లను తెరిచి వాహనాలను పంపిస్తున్నారు. కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద ఆరు బూత్ లను తెరిచి.. విజయవాడ వైపు వాహనాలను పంపిస్తున్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా టోల్ బూత్ లను ఆపరేటింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రద్దీని పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు. భారీగా నిలిచిపోయిన వాహనాలు : హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అబ్దుల్లాపూర్‌మెట్ ఇనాంగూడ వద్ద కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ క్రమలో లారీ లోని కట్టెలు రోడ్డుపై అడ్డంగా పడటంతో దాదాపు 6 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇమామ్ గూడ నుంచి ఔటర్ రింగ్ రోడ్ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన పోలీసులు రోడ్డుపై బోల్తా పడిన లారీ, కర్రలను తొలగించారు. హైదరాబాద్- విజయవాడ హైవేపై ట్రాఫిక్ క్లియర్ చేశారు. విజయవాడ వైపు సాఫీగా ప్రయాణాలు సాగుతున్నాయి. విధినిర్వహణలో కానిస్టేబుల్ మృతి : విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం వద్ద చోటు చేసుకుంది. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కోల నరేశ్ (40) మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్నారు. విజయవాడ మార్గంలో జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా నిలిపి ఉంచిన వాహనాలను తీయించేందుకు జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. కోల నరేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సీనియర్ సిటీజేన్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కారాలు



**జగిత్యాల జనవరి 13 (ప్రజా మంటలు):** తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటీజెన్లకు సంక్రాంతి పురస్కారాలను , ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళవారం జిల్లా సీనియర్ సిటీజేన్స్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణా రెడ్డి,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, ఉపాధ్యక్షుడు పూసాల అశోక్ రావు, బాలయ్య, ఎమ్.డి. యాకూబ్, సయ్యద్ యూసుఫ్, సత్యన్నారాయణ, సంజీవరావు, ఎమ్.డి.ఇక్బాల్, సుగుణాకర్ రావు, కరుణ,విజయలక్ష్మి,జిల్లా,డివిజన్,మండలాల సీనియర్ సిటీజేన్స్,పెన్షనర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.ద

## అరైవ్ ఆలివ్'పై రోడ్డు భద్రత అవగాహన సదస్సు



**ఎల్కతుర్తి జనవరి 13 ప్రజా మంటలు :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర డీజీపీ గౌరవంగా ప్రారంభించిన(అరైవ్ ఆలివ్') కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రతి ఒక్కరూ క్షేమంగా ప్రయాణించి తిరిగి ఇంటికి చేరాలనే ఉద్దేశంతో మహోన్నత లక్ష్యంతో వరంగల్ కమిషనరేట్‌లో ఉద్యమంగా ప్రారంభమైంది అని అన్నారు డీసీపీ ధార కవిత మంగళవారం రోజున డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి వద్ద వాహనదారులు,ఆటో డ్రైవర్లు,బాటసారులకు ఎల్కతుర్తి పోలీస్ వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరంగల్ డీసీపీ దార కవిత హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ దార కవిత మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వేగ పరిమితిని మించి ప్రయాణం చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల ప్రమాదాల ముప్పు అధికమవుతుందని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. 'అరైవ్ ఆలివ్' కార్యక్రమాన్ని ప్రజలంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్ ప్రయాణికులు ఆటో డ్రైవర్ల బాటసారులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ

**టి ఆర్ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ ఆధ్వర్యంలో**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్**

**తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు**



**ఎల్కతుర్తి జనవరి 13 ప్రజా మంటలు :** తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా క్యాలెండర్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్,తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ కరీంనగర్ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్ ఆధ్వర్యంలో క్యాలెండర్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు చాలా రామారావు,రవీందర్ తో పాటు జిల్లా నాయకులు సురావు బాబురావు, లోనే సతీష్, వంకే రాజు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు రక్షణ సమితి నిరంతరం కృషి చేస్తుందని, రైతుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేపడుతూ, ప్రభుత్వానికి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

## చైనా మాంజా ప్రమాదాలపై ఎస్హెచ్ఆర్‌సీ స్పందన

**అడ్వకేట్ రామారావు పిటిషన్...**

**హైదరాబాద్ సీపీ సజ్జనార్ కు నోటీసులు**

**సికింద్రాబాద్, జనవరి 13 ( (ప్రజామంటలు) :** చైనా మాంజా ప్రమాదాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్హెచ్ఆర్‌సీ) స్పందించింది. ఈ మేరకు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కు నోటీసులు జారీ చేసింది. చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రమాదాలు, తీసుకుంటున్న చర్యలపై ఫిబ్రవరి 26లోపు సమగ్ర నివేదిక సమర్పించాలని ఎస్హెచ్ఆర్‌సీ ఆదేశాలు ఇచ్చింది. చైనా మాంజా కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com